
అప్పుడే బస్సు దిగిన రామయ్యగారు హడావిడిగా నడుస్తున్నారు. ఈరోజే పని ఎలాగైనా పూర్తి చెయ్యాలని పట్టుదలతో కదుల్తున్నారు. చేతిలో బ్యాగ్! బ్యాగ్ నిండా క్యాష్... కష్టపడి గడించిన క్యాష్... జీవితంలో మిగిలిన మొత్తం సంపాదన! దాన్ని బ్యాంక్‌లో ఫిక్సిడ్ చెయ్యాలి. అది ఈరోజే జరగాలి! మళ్లీ రేపు ఆదివారం, సెలవు! అందుకే పని ముగించుకుని తిరిగి ఊరికి ప్రయాణమవ్వాలి. అదీ అతడి ఆలోచన.



# తప్పు

-కారంపూడి వెంకట రామదాస్

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

బ్యాంక్ చేరుకునేసరికి టైము పన్నెండూ పదిహేను! బస్సు గంట లేటు అవ్వడంతో ఈ టెన్షనంతా! కౌంటర్ చేరుకుని ఫిక్సిడ్ డిపాజిట్ ఫామ్ అడిగారు రామయ్యగారు.

"పన్నెండున్నర కావస్తోంది, ఇప్పుడు కుదరదు!" నిక్కచ్చిగా చెప్పాడు బ్యాంకు క్లర్క్. ఏం చెయ్యాలో తోచలేదు. బ్రతిమలాడుకున్నారు రామయ్యగారు. అయినా క్లర్క్ మనసు కరగలేదు.

ఇంతలో ఏ.సి. రూమ్ నుండి బయటకొచ్చాడు బ్యాంకు మేనేజర్ నిరంజన్ రావు. అతడి చూపు బ్రతిమలాడుతున్న రామయ్యగారి మీద పడింది. ఎక్కడో చూసిన గుర్తు! పరిచయమున్న వ్యక్తిగా తోచేసరికి నిశితంగా పరిశీలించాడు. వెంటనే అతడి కళ్ళు ఆనందంతో గుర్తుపట్టాయి.

"మాష్టారూ...! మీరు రామయ్యగారే కదా?" సందేహంగా అన్నాడు నిరంజన్‌రావు.

ఈ మాటలకి అటు చూసిన రామయ్యగారు, నిరంజన్‌రావుని చూసి గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేసారు.

"నేను, మాష్టారూ ... నిరంజన్... మీ దగ్గర హైస్కూలు చదువు చదివిన విద్యార్థి నిరంజన్... గుర్తుపట్టరా?"

"ఓరి నిరంజన్... నువ్వట్రా? యిక్కడేం చేస్తున్నావు?"

"ఈ బ్రాంచ్‌కి మేనేజర్ని మాష్టారూ!" ఉత్సాహంగా చెప్పాడు నిరంజన్.

"నిరంజన్! ఈ డబ్బు నేను ఫిక్సిడ్ చెయ్యాలి! మీ వాళ్ళు టైము అయిపోయింది తీసుకోమంటున్నారు! మూడు లక్షల క్యాష్ తీసుకుని తిరిగి ఊరు వెళ్ళడం అంత క్షేమం కాదు. యింతలో దేవుడ్లా నువ్వు కనిపించావు."

మాష్టారు వచ్చిన పని అర్థమైంది నిరంజన్‌కి.

"దాందేముంది, డబ్బు వెయ్యొచ్చు! ముందు మీరు నా కేబిన్‌కి రండి, కూర్చుని మాట్లాడుకుందాం!" అంటూ తన కేబిన్ వైపు కదిలాడు నిరంజన్.

"అది కాదు... యిటు టైం అయిపోతున్నాదీ..."

"బ్రాంచి మేనేజర్ని నేను! మీరు వచ్చిన పని పూర్తిచేస్తాను గదా! ముందు కూర్చోండి!" అంటూ సీటు చూపాడు నిరంజన్.

"సరే! నువ్వెలా వున్నావు? పెళ్ళైందా? ఎంత మంది పిల్లలు?" అప్పుడు వేసారు కుశల ప్రశ్నలు రామయ్యగారు.

"పెళ్ళైంది, యిద్దరు పిల్లలు! ఒక బాబు, పాప... స్కూల్లో చదువుతున్నారు. సరే, మీ విషయం చెప్పండి....?"

"ఏముందీ... మొన్నీమధ్యే రిటైరైనా! నాకొచ్చిన ఈ మూడు లక్షలు ఫిక్సిడ్ చేస్తే ఏదో నా రోజులు వెళ్ళిపోతాయి. మీ బ్యాంకు అందరికంటే ఎక్కువ వడ్డీ యిస్తున్నాది కదా! అందుకే మీ బ్యాంకులో డబ్బు దాచాలనుకుంటున్నాను."

ఈ మాటలు నిరంజన్ మౌనంగా వింటున్నాడు.

"ఎన్నో రోజుల తరువాత కలసిన మీరు రెండ్రోజులు మా యింట్లో ఉండి తీరాలి. అప్పుడే మిమ్మల్ని వదిలిపెట్టేది." అన్నాడు నిరంజన్.

"అబ్బే! కుదరదు! పని ముగించుకుని ఈ సాయంత్రం బస్సుకి ఊరెళ్ళిపోవాలి!" అన్నాడు రామయ్యగారు.

"లేదు, మాష్టారూ! కలవక కలవక యిన్నేళ్ళకి కలిసాము. బాల్యం నెమరువేసుకొనే అవకాశం వచ్చింది. మీరు రెండ్రోజులు నా అతిథిగా వుండండి! సోమవారం వెళ్దరు గానీ, కాదనవద్దు ప్లీజ్!" అభ్యర్థనగా అన్నాడు నిరంజన్.

ఉన్నత స్థితిలో వున్న తన విద్యార్థి అభిమానంగా ఉండమని అభ్యర్థిస్తుంటే కాదనలేకపోయారు రామయ్యగారు.

"సరే! ఈరోజు రావడంలేదని యింటికి ఫోన్ చేసి చెప్తాను. ఈ డబ్బు ఫిక్సిడ్ చేసుకుని పని పూర్తి చెయ్యు!" అన్నారు రామయ్యగారు.

"మాష్టారూ! నాదో మాట! మీరెలాగో వుంటానన్నారు కదా! యిప్పుడు దేనికి ఈ హడావిడిగా పని ముగించడం? ఎల్లుండి నింపాదిగా చూసుకుందాం, ముందు మన యింటికి వెళ్దాం పదండి" అన్నాడు నిరంజన్.

సరేనని రామయ్యగారు డబ్బు తీసుకుని నిరంజన్ వెంట కదిలారు.

మాష్టార్ని కారులో ఎక్కించుకుని యింటికేసి కదిలాడు నిరంజన్. దారి పొడుగునా చిన్ననాటి సంగతులు! నిరంజన్ మాటల్లో రామయ్యగారు పూర్తిగా లీనమైపోయారు.

* * *

"లతా! యితను మా ప్రియమైన రామయ్య మాష్టారు" భార్యకి పరిచయం చేసాడు నిరంజన్.

వెంటనే ఒంగి కాళ్ళకి నమస్కరించింది లత. రామయ్యగారు మనసారా దీవించారామెని. తరువాత పిల్లల్ని కూడా పరిచయం చేసాడు నిరంజన్. వాళ్ళూ రామయ్యగారి పాదాలకి నమస్కరించారు. వారి నమస్కారానికి రామయ్యగారు ముగ్ధులైయ్యారు.

"మాష్టారూ! మీకు గుర్తుందా? లెక్కల క్లాసులో నేను మిమ్మల్ని నా సందేహాలతో వేధించేవాడ్ని. అయినా మీరు విసుగుపోకుండా ఎంతో ఓపికగా నాకు లెక్కలు విడమర్చి చెప్పేవారు. అదే ఈరోజు నన్నీస్థితికి తీసుకొచ్చింది."

"ఒరే! నా స్థానంలో ఏ మాష్టారున్నా అదే చేసేవాడురా!" అన్నారు రామయ్యగారు.

"కాదు, మా రామయ్య మాష్టారికి సాటి వేరొకరు రారు!" టక్కున చెప్పాడు నిరంజన్.

రామయ్యగారు క్యాష్‌బ్యాగ్‌ని లతకిచ్చి భద్రపరచమన్నారు. లత అది తీసుకొని లోపలికి వెళ్ళింది.

భోజనం చేస్తూ వారి మధ్య ఎన్నో కబుర్లు! రామయ్య గారికి, లత వడ్డించింది అన్నం కాదు, ఆప్యాయత, అనురాగమనిపించింది. ఏదో తెలీని అనుభూతి అతన్ని కట్టిపడేసింది. మొత్తానికి వారి ఆప్యాయతల మధ్య భోజనం తృప్తిగా పూర్తిచేసారు రామయ్యగారు.

సాయంత్రం కారులో అందరూ బిర్లా టెంపుల్‌కి వెళ్ళారు. అలాగే మర్నాటి ప్రోగ్రామ్ కూడా ఫిక్స్ చేసాడు నిరంజన్.

మర్నాడు హైద్రాబాద్ మొత్తం తిరిగారు. రామయ్యగారైతే వారు చేసిన మర్యాదలకి ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

* * *

సోమవారం, ఉదయం పది గంటలు!

నిరంజన్ బ్యాంకుకి బయలుదేరడానికి సిద్ధమౌతున్నాడు.

"నిరంజన్! నేనూ వస్తాను. నా డబ్బు బ్యాంకులో వెయ్యాలి కదా?" అన్నారు రామయ్యగారు.

"అప్పుడే తొందర దేనికి మాష్టారూ! మరో రెండ్రోజులుండి వెళ్ళండి" అన్నాడు నిరంజన్.

రామయ్యగారికి ఎందుకో చిన్న సందేహం వచ్చింది. డబ్బు బ్యాంకులో వెయ్యమంటే, మాటదాటేస్తూ తనని యింకా వుండమనడం వింతగా తోచింది.

"లేదు, డబ్బు యివాళ వేసి తీరాల్సిందే, నేను సాయంత్రానికి ప్రయాణం కావలసిందే!" నిక్కచ్చిగా చెప్పారు రామయ్యగారు.

"అది కాదు, యింకొన్నాళ్ళు వుండండి!" బలవంతం చేసాడు నిరంజన్.

మొదటిసారిగా నిరంజన్ ప్రవర్తనమీద అనుమానం వచ్చింది రామయ్యగారికి. నా సొమ్ముకానీ, కొంప తీసి...? కంగారు పడ్డారు.

"యింతకీ నేనిచ్చిన డబ్బేది నిరంజన్?" యించుమించు నిలదీసినట్టే అడిగారు రామయ్యగారు.

ఈనాటికి దెబ్బతిన్నట్టు చూసాడు నిరంజన్. వీరి సంభాషణ వింటున్న లత లేచి లోపలికి వడివడిగా వెళ్ళిపోయింది.

మరుక్షణం రామయ్యగారి చేతిలో అతని మొత్తం మూడు లక్షల సొమ్మున్న బ్యాగ్ పెట్టింది లత.

ఆ బ్యాగ్‌లో చెక్కుచెదరని తన సొమ్మని చూసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఆ వెంటనే తన ప్రవర్తనపై తనకే సిగ్గేసింది రామయ్యగారికి.

"నిరంజన్! డబ్బు బ్యాంకులో వెయ్యమన్నప్పుడల్లా ఎందుకలా వెనకాడుతున్నావు?" సూటిగా ప్రశ్నించారు రామయ్యగారు.

అప్పుడు నోరు విప్పాడు నిరంజన్.

* * *

నిరంజన్‌తోపాటు బ్యాంక్ హైలెవల్ అఫీషియల్స్ కాన్ఫిడెన్షియల్ మీటింగ్‌లో వున్నారు.

"మిష్టర్ నిరంజన్! ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన లోన్ సేంక్షన్ పేపర్లు మీరు ఎప్రూవ్ చెయ్యాలి!"

"సార్! ఆ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పేపర్స్ నేను యింకా పూర్తిగా స్టడీ చెయ్యలేదు. నాకెందుకో దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఓ నిర్ణయంకి రావడం మంచిదని తోస్తోంది."

"మేం చెప్తున్నాం కదా! మరేం ఫరవాలేదు ఆ పేపర్స్ మీరు సంతకం చేసి వెంటనే లోన్ సేంక్షన్ చెయ్యండి" ఇది మా హుకుం అన్నట్టున్నాయి పై అధికారుల మాటలు.

"ఇది వంద కోట్ల లోన్ సార్! ప్రాజెక్ట్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో పరిశీలించి ఒక నిర్ణయం తీసుకోదలచాను."

"చూడు నిరంజన్! ఈ ప్రాజెక్ట్ మన చైర్మన్ బావమరిది తోడల్లుడిది. ఆ సంగతి మరచిపోకు. నీ అదృష్టం కొద్దీ ఈ లోన్ నీ బ్రాంచీ అండర్‌లోకి వచ్చింది. నీకు ఎలాగో ప్రమోషన్‌తోపాటూ ఐదువేల యింక్రిమెంట్ కూడా వస్తుంది! బాగా ఆలోచించుకో".

"సార్. నామాట సరే, మన బ్యాంక్ భద్రత గురించి ఆలోచించండి!"

"ఏంటయ్యా! మొండితనం! ఈ పని ఎలా చేయించుకోవాలో మాకు తెలీదనుకుంటున్నావా? సంతకాలు చేసి లోన్ సేంక్షన్ చేస్తే మంచిది. లేకపోతే... నువ్వు ఏ మారుమూల రాష్ట్రానికో ట్రాన్స్‌ఫర్ అవుతావు. నీ ప్లేసులో కొత్త మేనేజర్! ఎవరైనా కళ్ళకద్దుకుని చేస్తారయ్యా ఈ పని. ఆలోచించుకో, బాగా ఆలోచించుకో... ప్రమోషనో? ట్రాన్స్‌ఫరో?"

వారి మాటలకి అదిరిపడ్డాడు నిరంజన్. నిజమే ఈ లోకంలో నీతిని పాటించేవారికి కరువుగానీ, నీతిమాలిన వారికి లోటేమిటి?

"ఒ.కె. సార్... వన్‌వీక్ టైమివ్వండి! నా నిర్ణయం చెప్తాను!" నూతిలోంచి వచ్చినట్టున్నాయి ఆ మాటలు ఏ కళనున్నారో వారు, సరేనన్నారు.

* * *



"పొరపాటు నిరంజన్! నేను కాకపోతే ఆ తప్పు వేరొకడు చేస్తాడని అందుకే ఆ తప్పేదో నేనే చేస్తే పోతుందనుకోవడం ఘోరమైన తప్పు! ఆ వేరొకడు నీలాగే మనసున్నవాడు ఎందుకు కాకూడదూ?"

"అదీ మాష్టారు జరిగింది! నేను ఎటూ తేల్చుకోలేని స్థితిలో వున్న సమయంలో మీరు వచ్చారు. ఆ లోన్ సేంక్షన్ చేస్తే బ్యాంకు ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతింటుంది. ఎందుకంటే ఆ లోన్ రికవరయ్యే ఆస్కారం లేదు. దాంతో రెండు, మూడు నెలల్లో బ్యాంకు దివాళాతీసే స్థితికొస్తుంది. ఇది ఆలోచిస్తే నా మనస్సు తప్పుచెయ్యడానికి అంగీకరించడం లేదు. అలాగని ఒప్పుకోకపోతే, నేను కాకపోతే మరొకడు ఈ పని చేస్తాడు. అంతమాత్రానికి నేనెందుకు యిబ్బంది పాలుకావాలి? యిటువంటి పరిస్థితిలో మీ కష్టార్జితాన్ని మా బ్యాంకులో వేస్తే నష్టపోతారు. ఈ నిజం తెలిసీ కూడా మిమ్మల్ని ఎలా వారించకుండా వుండగలను? అందుకే మీరు డబ్బు ఫిక్స్‌డ్ చేస్తానన్నప్పుడల్లా మాట దాటేస్తున్నాను."

ఈ నిజానికి రామయ్యగారు నిర్ఘాంతపోయారు. నిరంజన్ దేవుడ్లా తనని ఆదుకున్నాడు. లేకపోతే తన గతి? తలచుకుంటేనే చెమట్లుపోసాయి రామయ్యగారికి.

"నిరంజన్! యింతకీ ఏం నిర్ణయం తీసుకున్నావు?" షాక్ నుండి తేరుకుని నెమ్మదిగా అడిగారు రామయ్యగారు.

"చూస్తుంటే, పరిస్థితులకి తలొగ్గక తప్పేటట్టు లేదు మాష్టారూ!"

"పొరపాటు నిరంజన్! నేను కాకపోతే ఆ తప్పు వేరొకడు చేస్తాడని అందుకే ఆ తప్పేదో నేనే చేస్తే పోతుందనుకోవడం ఘోరమైన తప్పు! ఆ వేరొకడు నీలాగే మనసున్నవాడు ఎందుకు కాకూడదూ?"

"మాష్టారూ... !" బాధతో అన్న ముక్క ఒక్కసారిగా వెలుబడింది నిరంజన్ నోట.

అవునన్నట్టు సూటిగా నిరంజన్ వైపు చూసారు రామయ్యగారు.

యిద్దరిమధ్యా కొన్ని క్షణాల మౌనం!

"మాష్టారూ! చిన్నప్పుడు మీరు చదవులో నన్నొక దారిలో పెట్టారు. ఇప్పుడు మీ రాకతో జీవితంలో నేను దారి తప్పకుండా చేసాను" స్థిరంగా వున్నాయి నిరంజన్ మాటలు. ★